క్లుప్తంగా

ఎంఈవో-2గా నాగభూషణం బాధ్యతల స్వీకరణ



నాగభూషణంను అభినందిస్తున్న ఎంఈవో రాంబాబు, సిబ్బంది

కొయ్యూరు: కొయ్యూరు ఎంఈవో-2గా కె.నాగభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జి.మాడుగుల ఎంఈవోగా విధులు నిర్వహించారు. అనంతరం సీలేరులో హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయనను కొయ్యూరు ఎంఈవో-2గా ఉన్నతాధికారులు నియమించారు. ఎంఈవో-2న నాగభూషణంను ఎంఈవో రాంబాబు, సీఆర్‌పీలు, సిబ్బంది తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

22 నుంచి పెద్దదేవుడి మహోత్సవాలు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ వాసుల ఇలవేల్పు పెద్దదేవుడు పండుగ మహోత్సవాలను ఈ నెల 22 నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు జి.ముకుందు, జి.గోపాల్. మధునరావు, విశ్వనాథం, అప్పలరాజు తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 23న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఒడిశా కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



సాయమందిస్తున్న యూటీఎఫ్ నేతలు కృష్ణ, రాంబాబు, హెచ్‌ఎం సాయిబాబా

గంగవరం: మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజనుడు పాతర చిన్నారావు ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు చిన్నారావు కుటుంబానికి సూరంపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.సాయిబాబా, యూటీఎఫ్ నాయకులు రూ.10,500 నగదు, రూ.5వేల విలువ చేసే నిత్యావసర సరకులను అందజేశారు. సీహెచ్.రాంబాబు దొర, కె.కృష్ణ, కె.బుజ్జి దొర, రామకృష్ణారెడ్డి, ఎస్.ఆర్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బాధిత గిరిజన కుటుంబాన్ని మండల ఉపాధ్యాయులు ఆదుకోవడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆదివాసీ స్వయంపాలన సదస్సు వాయిదా



మాట్లాడుతున్న సర్పంచ్‌లు

జి.మాడుగుల: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న ఆదివాసీ స్వయంపాలన సదస్సును తుపాను కారణంగా ఈనెల 27కు వాయిదా వేస్తున్నట్టు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, సర్పంచులు ఐసరం హనుమంతరావు, కొండబాబు, పెద్ద బాలన్న తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ తుపాను కారణంగా గిరిజన ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, ఈ సందర్భంగా సదస్సును రద్దు చేసినట్టు తెలిపారు. ఆదివాసీలు, ప్రజాప్రతినిధులు అందరూ గమనించాలని కోరారు.

పీసా కమిటీ ఎన్నికలకు అధికారుల నియామకం

రంపచోడవరం: ఏజెన్సీలోని 120 పంచాయతీల్లో పీసా కమిటీలు ఏర్పాటుకు అన్ని మండలాల్లో అధికారులను నియమించినట్టు పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 వరకు పీసా కమిటీలు ఏర్పాటుకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. 120 పంచాయతీల్లో 180 పీసా గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు. గ్రామసభలకు స్థానికులు తప్పనిసరిగా రావాలని కోరారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- వీధుల్లో రోజుల తరబడి చెత్త నిల్వలు
- విజృంభిస్తున్న దోమలు
- దుర్గంధంతో సతమతం
- ఆందోళనలో గ్రామాలు



గుంటసీమ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై వేస్తున్న కూరగాయల చెత్త



కించుమండ వారపుసంత వద్ద పేరుకుపోయిన చెత్త



వారపు సంత షెడ్డు వద్ద పేరుకుపోయిన చెత్త

డుంబ్రిగుడ: మండలంలోని పారిశుధ్యం కొరవడి గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులు ఉదయాన్నే పారిశుధ్య పనులు నిర్వహించి ఆయా చెత్తా చెదారాలను సమీప ఆరోగ్యకేంద్ర రోడ్డు వద్ద, గుంటసీమ రహదారి వద్ద పడేస్తుండడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో సేకరించిన చెత్తాచెదారాలను డంప్ చేసేందుకు గ్యాస్ గోడౌన్ల వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుచేశారు. అయితే ప్రస్తుతం ఆ డంపింగ్ యార్డు స్థలం లేకపోవడంతో చెత్తను ఎక్కడ డంప్ చేయాలో అర్థం కాక రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ చెత్తాను పడేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

సంత ప్రాంతం చెత్తమయం

అరకు గ్రామ మేజర్ పంచాయతీలో పారిశుధ్య లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వారపు సంతలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సంతలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు గుట్టలు, గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో సంతకు వచ్చే కొనుగోలుదారులు, వ్యాపారులు దుర్గంధంతో సతమతమవుతున్నారు. ముక్కుమూసుకొని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారపు సంత నిర్వహిస్తున్న చోటే ఇటీవల మద్యం దూకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో నిత్యం ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక గ్లాసులు, ఇతరత్రా వస్తువులతో చెత్త నిండి ఉంటోంది. ఇక్కడ పక్కన ఉన్న చెత్తకుప్పల నుంచి ఈగలు సంతలోని దుకాణాల్లో చేరుతున్నాయి.కించుమండ పంచాయతీలో పారిశుద్ధ్యం తాండవిస్తుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మురుగనీటితో పాటు అపరిశుభ్రం కారణంగా మండల వ్యాప్తంగా ప్రజలకు రోగాలు ప్రబలే అవకాశాలున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

చెత్త నుంచి సంపద సేకరణ షెడ్లు మండలంలోని నాలుగుచోట్ల ఏర్పాటు చేసి ఉన్నా ఉపయోగంలోకి లేకపోవడంతో పంచాయతీలు, గ్రామాలు దుర్గంధమయంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి పంచాయతీకి ఒక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంలో అధికారులు, యంత్రాంగం విఫలమైందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని 18 పంచాయతీల్లో డంపింగ్ యార్డ్‌లు ఏర్పాటు చేయాలని, అధిక సంఖ్యలో పారిశుధ్య కార్మికులను నియమించాలని పలువురు కోరుతున్నారు. పోతంగి, కించుమండ, గసభ, గుంటసీమ నాలుగు పంచాయతీల్లో చెత్తను తొలగించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఓ ట్రాక్టర్‌ను మంజూరు చేశారు. అయితే ఆ ట్రాక్టర్ ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంతో పాటు అరకులో చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. వారపు సంత కూరగాయలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండడంతో సంతకు వచ్చే గిరిజనులు ముక్కుమూసుకొని వెళ్తున్నారు. అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– సిదరి వీర్రన్న, అరకు గ్రామస్తుడు, డుంబ్రిగుడ మండలం

దోమలతో సతమతం



కించుమండ జీసీసీ డిపో ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో రోడ్డుపైనే చెత్తా చెదారం పడేస్తున్నారు. జీసీసీ డిపో నుంచి సరకులు పొందేందుకు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. అధికారులకు కాలువలతో పాటు పారిశుధ్యం మెరుగుపరచాలని విన్నవించినా పట్టించుకోవడం లేదు. దోమల వ్యాప్తితో సతమతమవుతున్నాం. అధికారులు స్పందించాలి.

– మర్రి నాగేశ్వరరావు, గ్రామస్తుడు, డుంబ్రిగుడ

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మండలంలోని పలు పంచాయతీల్లో పేరుకు పోయి ఉన్న చెత్తాచెదారాలను తొలగించే పనులు చేపడుతున్నాం. పలుచోట్ల కేటాయించిన ట్రాక్టర్లుకు చెత్తను తీసుకెళ్లేందుకు తొట్టిలు లేవు. తడి, పోడి చెత్తాలను వేరుచేసేందుకు చెత్త నుంచి సంపద సేకరణ షెడ్లు ఉన్నాయి. వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం.

–ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

తాగునీటి సౌకర్యానికి వితరణ



వార్డెన్‌కు మోటారు తదిత సామగ్రి అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో తాగునీటి సౌకర్యానికి జేకే చారిటబుల్ ట్రస్ట్ వితరణ అందజేసింది. హాస్టల్ విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ స్పందించారు. ఈ మేరకు ఆయన హాస్టల్ ఆవరణలో రూ.50 వేల వ్యయంతో బోరు ఏర్పాటుతో పాటు రూ.30 వేల వ్యయంతో మోటారు, ఇతర సామాగ్రిని ఆయన గురువారం సిబ్బందికి అందజేశారు. విద్యార్థుల నీటి కష్టాలు తెలుసుకుని సమస్యను పరిష్కరించిన జమాల్‌ఖాన్‌ను హాస్టల్ వార్డెన్ తాతాజీతో పాటు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే రియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ ప్రియాంక, నేతలు

గూడెంకొత్తవీధి: గ్రామాల్లో తాగునీటి సదుపాయాలతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ బోయినకుమారి అన్నారు. మొండిగెడ్డ పంచాయతీ గుడివాడ, గాలిమానువీధి గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులతో చేతి పంపుల నిర్మాణ పనులను ఆమె గురువారం ప్రారంభించారు. సర్పంచ్ ప్రియాంక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందెరి రామకృష్ణ, వార్డు సభ్యులు లక్ష్మణ్, గ్రామస్తులు హరి, వెంకట్ సతీష్ పాల్గొన్నారు.

వీడని వర్షం.. అన్నదాత కలవరం

- కోతకు వచ్చిన వరి
- తుపాను హెచ్చరికలతో రైతుల్లో గుబులు



పంటపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

రాజవొమ్మంగి: ఖరీఫ్ వరి కోతకు వచ్చింది. పంట ఇంటికి తెచ్చుకొనే సమయంలో తుపాను హెచ్చరికలు రైతు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా ఏడు మండలాల్లో ఈ ఏడాది మొత్తం 24,150 మంది రైతులు సుమారు 45వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. సుమారు 76వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది 28 కొనుగోలు కేంద్రాల ద్వారా 25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమైనట్టు అధికారులు చెబుతున్నారు. ఇటీవల 15 రోజుల క్రితం తుపాను కారణంగా కోతలు వాయిదా పడ్డాయి. ఇప్పుడిప్పుడే కోతలు జరుగుతుండగా మరోసారి తుపాను హెచ్చరికలు, అందుకు తగినట్లుగా చెదురు మదురు చినుకులు రైతులను తీవ్ర అయోమయంలోకి నెట్టేస్తున్నాయి. కోసిన పంటను ఒడ్డుకు తెచ్చి కుప్పలు వేసే సమయం కూడా లేకపోవడంతో పంటను ఒబ్బిడి చేసుకొనేందుకు రైతులు అహర్నిశలు శ్రమ పడుతున్నారు. కొన్నిచోట్ల యంత్రాలతో కోతలు పూర్తయినప్పటికీ ధాన్యం పూర్తిగా ఆరకపోవడంతో నెమ్ముతో చేరింది. ఎండ కాస్తే ధాన్యం ఎండ బెట్టేందుకు రైతులు ఎదురుతెన్నులు చూస్తున్నారు. మరి కొన్ని చోట్ల కోసిన పనలు పంట భూముల్లోనే ఉన్నాయి. అదే విధంగా నూర్పిళ్లు పూర్తయిన చోట ధాన్యం రాసులుగా పోసి, తడిసి పోకుండా టార్పాలిన్లు కప్పి నిల్వ చేశారు. ప్రస్తుతం వాతావణం అనుకూలంగా లేకపోవడం, చినుకులు పడుతుండడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు. మరో వైపు కూలీ రేట్లు పెరిగిపోవడంతో రోజురోజుకు పెట్టుబడి పెరిగి పోతోందని మదన పడుతున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుకు పెట్టుబడి సాయం అందేది. ప్రస్తుత ప్రభుత్వం నుంచి అటువంటి సాయం లేకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు సొమ్ము తెచ్చి అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం తగ్గి ఎండ కాస్తే పండిన పంట అమ్ముకొని అప్పులు తీర్చాలని ఎదురు చూస్తున్నారు.

స్థానిక గిరిజన నిరుద్యోగులకే ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న అల్లూరి యూత్ సభ్యులు

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో స్థానిక యువతకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అల్లూరి సీతారామరాజు యువజన సేవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యప్రకాశ్, ఎం. నవసూర్యలు యూత్ సభ్యులతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా పేరొందిన చాపరాయి జలవిహారిలో పోతంగి పంచాయతీ పరిధిలోని డుంబ్రిగుడ, సంతవలస, కోసంగా గ్రామస్తుల యువకులను కాకుండా కొల్లాపుట్టు ఏకో టూరిజంలో పనిచేస్తున్న వారిని తీసుకొచ్చి ఉద్యోగాలు ఇవ్వడంతో స్థానిక యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 2009 నుంచి 2022 వరకు చాపరాయిలో టెండర్ ద్వారా స్థానిక గిరిజనలకు ఉపాధి కలిగేదని టెండర్ సొమ్ము సుమారు రూ.2 కోట్లు వరకు ఐటీడీఏ ఖజానాలో ఉంటే ఆ సొమ్ముతో చాపరాయి అభివృద్ధి చేసి స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా అధికారులు టోకరా పెట్టారని ఆరోపించారు. బొర్రా, పద్మాపురం, కొత్తపల్లి పర్యాటక ప్రాంతాల్లో స్థానిక గిరిజన నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ పాలక అధికారులు స్పందించి స్థానిక గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. అవినష్, కిరణ్, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బొయితిలిలో అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో వినియోగదారుల జిల్లా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జాతీయ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో 8,9 తరగతుల విద్యార్థులకు ఈ నెల 22న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులందరూ పోల్గొవాలని సూచించారు.విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000 మూడో బహుమతిగా రూ.1,500 ప్రభుత్వం ప్రకటించినట్టు చెప్పారు. జిల్లా పోటీల్లో విజేతలు, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో గెలిపొందిన వారికి రూ.70,000 నగదు బహుమతిని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. హెచ్‌ఎం అప్పలకొండ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. హెచ్‌ఎం అప్పలకొండ, ఉపాధ్యాయలు నీలందొర, నూకరాజు, వినియోగదారుల సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వై.రామవరం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర చెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించి, ఆరోగ్యసూత్రాలపై విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడం, వర్షాలు కురుస్తుండడంతో దోమలు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. చికున్‌గున్యా సోకితే కీళ్ల నొప్పులు 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుందని, లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని, వేడినీళ్లు తాగాలని సూచించారు.

రగ్గుల పంపిణీ



సీతగుంట ఈము ప్రార్థన మందిరంలో రోగులకు రగ్గులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు



మాజీ ఎంపీపీ రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

పెదబయలు: మండలంలోని సీతగుంట ఈము ప్రార్థన మందిరంలో గురువారం పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల పాస్టర్లు, సేవకులకు గురువారం ఆరాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడకు చెందిన పాస్టర్ అనిల్ కుమార్ పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హుకుంపేట మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిరి రవిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ఏసు బోధనలు మానవాళికి అవసరణీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా 157 మంది పేదలకు రగ్గులను పంపిణీ చేశారు. ఒకొరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటుచేశారు. ప్రార్థన మందిరం అధ్యక్షుడు వైకుంఠం, ముంచంగిపుట్టు, హుకుంపేట, మండలాల పాస్టర్ల సంఘం అధ్యక్షులు మోహన్‌రావు, మోజేష్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

58 మందికి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలోని దార్రెల పంచాయతీ చికుచింత గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి, 58 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో జ్వరాలతో బాధపడుతున్న 5 గురికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ వంటి వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనా రోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజ చేస్తున్న మాలధారులు



పూజలో పాల్గొన్న భక్తులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి శరణ ఘోషతో మార్మోగింది. జోలాపుట్టు అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో ఘనంగా అంబలం పూజను నిర్వహించారు. ముందుగా గణపతి, కుమారస్వామి, మెట్ల పూజలను జరిపించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం, కుంకుమ, చందన, పసుపుతో అభిషేకాలు చేశారు.మహా మంగళహారతితో పూజ కార్యక్రమం ముగించారు. పూజల్లో భాగంగా ఏర్పాటుచేసిన అయ్యప్ప స్వామి ఆలయ నమూనా, విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, భర్త మూర్తితో కలిసి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప సేవా పీఠం గురుస్వాములు పూజలను చేయించారు.

గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం: ఏజెన్సీ నిర్వహించనున్న పీసా గ్రామసభలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. లక్కొండ పంచాయతీలో నిర్వహించిన పీసా గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో పీసా గ్రామసభలను నిర్వహించి పీసా గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన అధికార బృందం



విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్టును పరిశీలిస్తున్న అధికారులు

ఎటపాక: మండలంలోని గౌరీపేట పీహెచ్‌సీను రాష్ట్ర అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఎన్‌సీడీసీడీలో భాగంగా చేపడుతున్న ఇంటింటా సర్వేపై సమీక్ష నిర్వహించారు. స్టేట్ టీం మెంబర్ డాక్టర్ రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరాజ్ కిరణ్, డాక్టర్‌దేవి నాగ్, డాక్టర్ శ్రీదేవి, హెచ్‌వీలు పీహెచ్‌సీ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ బృంద సభ్యులు నెల్లిపాక పీహెచ్‌సీను కూడా తనిఖీ చేశారు. డాక్టర్ విష్ణుప్రియ, పీహెచ్‌ఎన్ అరుంధతి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

పెదబయలు: మండలంలోని రూడకోట పంచాయతీ పెదకొండ, బడంబీరు, రుండలంపుట్టు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ కె.సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సంగీత, గ్రామస్తులు గురువారం పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు సౌకర్యం లేక నిత్యావసర సరకులు, రోగులకు ఆస్పత్రులకు తరలించేందుకు అవస్థలు పడుతున్నామని, వర్షం పడితే రహదారులు అత్యంత దారుణంగా మారుతున్నాయని వినతిలో పేర్కొన్నారు. రహదారి సమస్యను పరిష్కారించి తమ కష్టాలు తీర్చాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు సర్పంచ్ సురేష్‌కుమార్ తదితరులు చెప్పారు.